www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 18 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-213 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# కాంగ్రెస్ సీనియర్ల సేవ్ కాంగ్రెస్ నినాదం

## భట్టి నివాసంలో సీనియర్ల ప్రత్యేక భేటీ



కమిటీల పేరుతో సీనియర్లకు అవమానం

బయటినుంచి వచ్చిన వారికే పెద్దపీట

సోషల్ మీడియా వేదికగా సీనియర్లపై అసత్య ప్రచారం

**హైదరాబాద్, డిసెంబర్ 17 (సమ సమాజం):** కాంగ్రెస్‌లో కమిటీ చిచ్చురాజుకుంటోంది. కాంగ్రెస్ సీనియర్లు ఈ విషయంలో భగ్గుమంటున్నారు. బయటినుంచి వచ్చిపార్టీలో చేరిన వారికి పెద్దపీట వేసి, తొలినుంచి కాంగ్రెస్ వాదులుగా ఉన్నవారిని పక్కన పెట్టారన్న వివాదం రేగుతోంది. దీంతో సేవ్ కాంగ్రెస్ నినాదంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సిఎల్పి నేత భట్టి నివాసంలో సీనియర్ 3లో

## నేడు ఈశాన్య రాష్ట్రాల్లో మోడీ పర్యటన



ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలే లక్ష్యంగా ప్రధాని టూర్

రూ.6800 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17 (సమ సమాజం):** భారత దేశంలోని 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు 2023లో జరగనున్నాయి. ఈ క్రమంలోనే త్రిపుర, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికలు కూడా వచ్చే ఏడాది మార్చిలోజరుగనున్నాయి. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం పర్యటించి అక్కడ దాదాపు రూ.6800 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందులో హౌసింగ్, రోడ్లు, వ్యవసాయం, టెలికాం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (, టూరిజం, హాస్పిటాలిటీ వంటి పలు రంగాలకు చెందిన ప్రాజెక్టులు ఉన్నాయని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. ఈ మేరకు పీఎంఓ తాజాగా ఒక ప్రకటనను కూడా విడుదల చేసింది. ఈశాన్య మండలి స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొంటారని దానితో పాటు షిల్లాంగ్‌లో జరిగే సమావేశానికి కూడా ఆయన హాజరవుతారని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. ప్రధాని మోదీ పర్యటనలో బాగంగా.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-అర్బన్ అండ్ రూరల్ పథకం 3లో

## వైద్య రంగంలో తెలంగాణ అగ్రగామి

ఉచితంగా కిడ్నీ పేషెంట్లకు డయాలసిస్

నిమ్స్‌లో అత్యాధునిక పరికరాలు ప్రారంభించిన మంత్రి హరీష్

**హైదరాబాద్, డిసెంబర్ 17 (సమ సమాజం):** వైద్య రంగంలో తెలంగాణ అగ్రగామిగా మారిందని మంత్రి హరీశ్ రావు అన్నారు. డయాలసిస్ రోగులకు సేవలందించే విషయంలో రాష్ట్రం ముందుందని మంత్రి హరీశ్ రావు అన్నారు. దేశంలో సింగిల్ యూజ్ ఫిల్టర్ డయాలసిస్ సిస్టమ్‌ను ప్రభుత్వ దవాఖానల్లో అందుబాటులోకి తీసుకొచ్చిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. గతంలో ఇది కార్పొరేట్ హాస్పిటళ్లకే పరిమితమైందన్నారు. హైదరాబాద్ నిమ్స్ దవాఖానలోని న్యూరో విభాగంలో రూ.2 కోట్లతో ఏర్పాటుచేసిన అత్యాధునిక వైద్య పరికరాలను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వైద్యులు నిత్య విద్యార్థులేనని



3లో

## మాకు నోటీసులు వస్తాయని ముందే ఎలా తెలుసు

దమ్ముంటే భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి రావాలి

కర్నాకట కేసులో నోటీసులపై బండి ప్రమాణం చేయాలి

తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సవాల్

**హైదరాబాద్, డిసెంబర్ 17 (సమ సమాజం):** మాకు ఈడీ నోటీసులు వస్తాయని బీజేపికి ముందే ఎలా తెలుసని తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి నిలదీసారు. బీజేపీకి అబద్దాలు చెప్పడం కామన్‌గా మారింది. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని బీజేపీ రాజకీయంగా వాడుకుంటుంది. నాకు కర్ణాటక పోలీసుల నుంచి నోటీసులు వస్తే అమ్మవారి సాక్షిగా బీజేపీ చూపించాలి. అయ్యప్ప దీక్ష వేసుకొని నేను ప్రమాణం చేస్తున్నా.. నాకు కర్ణాటక నుంచి ఎటువంటి నోటీసు రాలేదు. డ్రగ్స్ కేసుల్లో ఎఫ్ఐఆర్‌లో ఎక్కడా నా పేరు లేదు. బండి సంజయ్



3లో

## హెటిరో పరిశ్రమలో చిరుత కలకలం

పట్టుకునేందుకు రంగంలోకి దిగిన జూ అధికారులు



**సంగారెడ్డి,డిసెంబర్17(సమ సమాజం):** హెటిరో పరిశ్రమలోకి చిరుత ప్రవేశించి కలకలం సృష్టించింది. దీంతో దానిని పట్టుకునేందుకు జూ పార్క్ అధికారులు రంగంలోకి దిగారు. 3లో

## విభజనతో పాటే కాశ్మీర్ చిచ్చు

విభజన గాయాలకు నేటికీ దొరకని పరిష్కారం


పాక్ కుట్రలతో ప్రపంచానికి ఉగ్రవాద ముప్పు

నాటి పాలకుల దృష్టి లోపంతోనే సమస్య తీవ్రం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17 (సమ సమాజం):** కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమైనా.. ఆక్రమిత కాశ్మీర్ సమస్యనేటికీ తెగడంలేదు. కాశ్మీర్ రాజు ఒప్పందం మేరకు కాశ్మీర్ యావత్తూ భారత్ భూభాగంగా 3లో

## జర్నలిస్టులు,లాయర్లు స్వతంత్రంగా ఉండాలి

సుప్రీం మాజీ న్యాయమూర్తి బీఎన్ శ్రీకృష్ణ పిలుపు



3లో

## గుట్టుచప్పుడు కాకుండా కల్తీ మద్యం విక్రయం

కోటి వరకు పట్టుకున్న ఎక్సైజ్ శాఖ



**హైదరాబాద్,డిసెంబర్17(సమ సమాజం):** కొన్ని నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న నకిలీ, అక్రమ మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. దీని విలువ సుమారు రూ. 1 కోటి ఉంటుందని తెలిసింది. నకిలీ, అక్రమ మద్యం కేసు వివరాలను వెల్లడించడానికి ఎక్సైజ్ పోలీసులు నిరాకరించారు. ఇప్పటికే నకిలీ, అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్న పలువురు నిందితులను జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపులోనికి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. వీరి ద్వారా పూర్తి వివరాలను కూపీ లాగుతున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితమే ఎక్సైజ్ పోలీసులు ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్‌తోపాటు చౌటుప్పల్ మండలంలోని దేవలమ్మ నాగారం గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై 3లో

## తెలుగు ఖ్యాతిన, సంస్కృతి విశ్వవ్యాప్తం

తానా కృషి అభినందనీయమన్న వెంకయ్య

కళాకారును సన్మానించిన మాజీ ఉపరాష్ట్రపతి

**హైదరాబాద్,డిసెంబర్17(సమ సమాజం):** ఖండాంతరాలు దాటి వెళ్లినా.. తానా సభ్యులు జన్మభూమి రుణం తీర్చుకుంటున్నారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభినందించారు.



3లో

## ముగిసిన బాలిక ఇందు అంత్యక్రియలు

భారీగా మొహరించిన పోలీసులు

**హైదరాబాద్, డిసెంబర్ 17 (సమ సమాజం):** బడి నుంచి అదృశ్యమైన చిన్నారి ఇందు జీవితం విషాదంగా ముగియగా అశ్రునయనాల మధ్య శనివారం అంత్యక్రియలు ముగిసాయి. స్కూల్ నుంచి



3లో

## బిలావల్ భుట్టోకు వ్యతిరేకంగా బిజెపి ఆందోళన





పాక్ ఎంబెసీ ముందు నిరసన కార్యక్రమం

బిలాల్ వెంటనే క్షమాపణలు చెప్పాలన్న నేతలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17 (సమ సమాజం):** పాక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బీజేపీ నేతల ఆందోళనలు మిన్నంటాయి. ప్రధాని మోడీపై పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బీజేపీ నిరసనలు చేపట్టింది. బీజేపీ కార్యకర్తలు పాక్ విదేశాంగ మంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఢిల్లీ, ముంబై సహా అన్ని రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తల నిరసనలు కొనసాగాయి. 'గుజరాత్ కసాయి' అంటూ బిలావల్ భుట్టో చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరమని.. దీనికి పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకోక 3లో

## ఇండియన్ లైబ్రరీ కాంగ్రెస్‌కు కవితకు ఆహ్వానం

**హైదరాబాద్, డిసెంబర్ 17 (సమ సమాజం):** వచ్చేనెల 2, 3 తేదీల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేరళలో పర్యటించనున్నారు. కేరళలోని కన్నూరులో జరుగనున్న ఇండియన్ లైబ్రరీ కాంగ్రెస్ లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఇండియన్ లైబ్రరీ కాంగ్రెస్ ప్రతినిధులు కవితకు ఆహ్వానం పలికారు. నవరి 2వ తేదీ సాయంత్రం జరగనున్న సాంస్కృతిక ఉత్సవాలకు కవిత ముఖ్య అతిథిగా హాజరవుతారు. 3వ తేదీన సంస్కృతిపై జరిగే చర్చలో పాల్గొంటారు.



3లో

## జగిత్యాల డిపోలో సజ్జన్నార్ తనిఖీలు



**జగిత్యాల, డిసెంబర్ 17 (సమ సమాజం):** జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో, కొత్త బస్టాండ్‌లో టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆకస్మిక తనిఖీలు 3లో

## సంపాదకీయం

# చరిత్ర తెలియని పాక్ భుట్టో !

జుల్ఫీకర్ అలీ భుట్టో నుంచి నేటి బిలావల్ భుట్టో వరకు అంతా.. చరిత్ర తెలియని మూర్ఖులే..వారికి దేశ విభజన ఎలాంటి పరిస్థితుల్లో జరిగిందో తెలియదు. ఎందుకు దేశాన్ని జిన్నా చీల్చాల్సి వచ్చిందో తెలుసుకోవాలి. ఆనాటి బ్రిటిష్ తొత్తుల కారణంగా దేశం విభజన జరిగింది. ఆనాటి నుంచి విభజిత భారత్ వంచింప బడుతూనే ఉంది. పాక్ ఎలా ఏర్పడిందో ముందు బిలావల్ తెలుసుకోవాలి. పాక్‌తో పాటు కాశ్మీర్ ఎలా ఆక్రమణకు గురయ్యిందో కూడా బిలావల్ తెలుసుకోవాలి. చరిత్ర తెలియకుండా మంత్రిపదవిని దక్కించు కున్న బిలావల్ భారత్‌పై ప్రేలాపనలు పేలడం సహించరాని విషయం. దీనికి గట్టిగానే సమాధానం చెప్పాలి. ఇక నిరంతరం దేశ విభజన గాయాలను వల్లెవేయాలి. పాక్ ఎలా ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తూ ఎలా ఉగ్రవాద కార్యకలాపాలను ఎలా ప్రోత్సహిస్తున్నది ప్రపంచానికి తెలపాలి. ఎన్ని ఉగ్రదాడులను ఎలా చేయించిందో చెప్పాలి. ప్రపంచ వ్యాప్తంగా పాక్ తీరును పనిగట్టుకుని ఎండగట్టాలి. ఇవన్నీ మరచిన పాకిస్థాన్ మంత్రి బిలావల్ భుట్టో తన వక్రబుద్ధిని ఐక్యరాజ్యసమితి వేదికగా ప్రదర్శించారు. దీనికి భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన తీరు అభినందనీయం. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ న్యూయార్క్‌లో చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికే భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. అధికార బీజేపీ సైతం పాక్ వ్యాఖ్యలపై మండిపడింది. ఢిల్లీలోని పాక్ హైకమిషన్ దగ్గర శుక్రవారం భారీ నిరసన చేపట్టింది. శనివారం దేశవ్యాప్తంగా నిరసనలను నిర్వహించాలని బీజేపీ అధిష్టానం పిలుపునిచ్చింది. పాక్ సిగ్గుమాలిన వ్యాఖ్యలపై ఆ దేశం తలదించుకోవాలి. దేశాన్ని ఎలా అభివృద్ది చేసుకోవాలో తెలియని మూర్ఖుల దండు పాక్‌లో ఉంది. అక్కడి హిందువులను ఊచకోత కోసిన సిగ్గుమాలని నేతలు ఇవాళ భారత్ పై ప్రేలాపనలు పేలడం వారి దుష్టబుద్ధిని పదేపదే ప్రదర్శిస్తున్నారు. నిజానికి ఆనాడే పాక్‌ను నిలువరించ గలిగి ఉంటే ఇవాళ ఇంతదారుణం జరిగేది కాదు. యుద్దాల్లో ఓడిన వెంటనే పాక్‌కు తగిన బుద్ధి చెప్పక పోవడం వల్లనే ఇవాళ విషం కక్కుతున్నారు. ఇంతజరిగిన పాకిస్థాన్ మంత్రి బిలావల్ ప్రకటన అత్యంత నీచమైన ప్రకటన చేసి తన దుర్బుద్దిని చాటుకున్నారు. ఇది సిగ్గుచేటు కాక మరోటి కాదు. పాకిస్తాన్ విదేశాంగ మంత్రి వ్యాఖ్య అత్యంత అవమానకరమైనదిగా ఉంది. పిరికితనంతో ఇలాంటి వ్యాఖ్యలకు దిగుతున్నట్లుగా గుర్తించాలి. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తోందని గుర్తించాలి. పాక్‌లో సంక్షోభం ఏర్పడ్డప్పుడు,అక్కడ ప్రజల్లో వ్యతిరేకత వచ్చినప్పుడల్లా భారత్ వ్యతిరేకతను వ్యక్తం చేయడం,అక్కసు వెళ్లగక్కడం అలవాటుగా చేసుకున్నారు. పాక్ పాలకులంతా కడుపులో విషం దాచుకున్న నేతలే అనడంలో సందేహం లేదు. బిలావల్ భుట్టో ప్రకటన మరోమారు ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేం దుకు చేసని ప్రయత్నంగానే చూడాలి. ఇప్పటికే పాక్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం, అన్యాయం, అరాచకం అక్కడ రాజ్యమేలుతోంది. పాక్ సైన్యంలో చెలరేగుతున్న విభేదాలు, క్షీణిస్తున్న ప్రపంచ సంబంధాలు, పాకిస్తాన్ తీవ్రవాదులకు ప్రధాన ఆశ్రయంగా మారిన వాస్తవం దృక్పథం నుంచి ప్రపంచ దృష్టిని మళ్లించడం లక్ష్యంగా చేస్తున్న పిరికిపంద చర్యగానే భుట్టో ప్రకటనను చూడాలి. ఇకపోతే యూఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ వేదికగా ఈ ఉగ్రవాదం ఇంకెన్నాళ్లంటూ పాకిస్తాన్ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు.. ఇది మీ మంత్రిని అడగండంటూ భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కౌంటర్ ఇచ్చారు. దీనిని జీర్ణించుకోలేని పాక్ అభ్యంతకర వ్యాఖ్యలు చేసింది. ఒక బిన్ లాడెన్ చనిపోయాడు.. కానీ ఇంకో బిన్ లాడెన్, గుజరాత్ కసాయి ఇంకా బతికే ఉన్నాడంటూ పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిలావల్ ప్రధాని నరేంద్ర మోదీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ద్వారా తన వాచాలత్వాన్ని ప్రదర్శించారు. తన అజ్ఞానాన్ని ప్రదర్శించాడు. ముంబై

దాడులకు, ఊచకోతకు ఎవరు కారకులో బిలావల్ చెప్పి ఉంటే బాగుండేది. పుల్వామా దాడికి ఎవరు కారకులో చెప్పి ఉంటే బాగుండేది. కార్గిల్ యుద్దానికి ఎవరు కారకులో చెప్పివుంటే బాగుండేది. నిజానికి ప్రపంచ ఉగ్రవాదానికి పుట్టినిల్లు పాకిస్తాన్.. బిన్ లాడెన్‌కి ఆశ్రయమిచ్చింది.. ఆ దేశమే. ఇది ప్రపంచానికి తెలుసు. లాడెన్‌ను ఎక్కడ మట్టుబెట్టరో ప్రపంచానికి తెలుసు. భారత్‌పై దాడి చేసిన ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నారో ప్రపంచానికి తెలుసు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తోంది పాక్ అన్న విషయం కూడా ప్రపంచా నికి తెలుసు. అందుకే భారత విదేశాంగ మంత్రి జైశంకర్.. పాక్ తీరుపై పై విరుచుకుపడ్డారు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలి వేదికగా ప్రపంచ దేశాల ముందు పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని.. జైశంకర్ తూర్పారపట్టారు. బిలావల్ తన వ్యాఖ్యలతో ..మరోసారి పాకిస్తాన్ నీచస్థితిని బయటపెట్టుకుంది. అనాగరికంగా వ్యవహరిస్తున్న దేశం ఏదైనా ఉందంటే అది పాక్ మాత్రమే. మాటల్లో హద్దులు దాటుతూ..సరిహద్దుల్లో ఉగ్రవాదులను దాటిస్తూ పోతున్న దేశం ఏదైనా ఉద్దంటే అది పాక్ మాత్రమే.భారత్‌పై వ్యాఖ్యలు చేసేముందు పాక్ తమ నీచ స్థితిని గుర్తించుకోవడం మంచిది. నిజానికి భారత స్వాత్ర్య ఉద్యమ చరిత్రలో బ్రిటిషర్ల దమనకాండ కన్నా విభజన వల్ల జరిగిన రక్తపాతమే అధికం. దాదాపు పదిలక్షల మంది ఊచకోతకు గురయ్యారంటే ఆ రక్తపాతం ఎంతగా పారిందో నేటితరం తెలుసు కోవాలి. విభజన గాయాలను అధ్యయనం చేయాలి. బ్రిటిష్ వారు పోతూపోతూ దేశాన్ని మతప్రాతిపదకన విభజించే చిచ్చు పెట్టారు. ఒక్కటిగా ఉన్న భారతావనిని ముక్కలు చేశారు. వారు పాలించడం వల్ల కలిగిన నష్టం కంటే విభజించడం వల్ల కలిగిన నష్టం పూడ్చుకోలే కుండా పోయింది. విభజనను ఆపడానికి నాటి నాయకులకు శక్తి లేకుండా ..స్వాతంత్ర్యంతో ముడిపెట్టి చేతులు కట్టేశారు. ఓ రకంగా ఈ నష్టం భూమ్యా కాశాలు ఉన్నంత వరకు తీరవనే చెప్పాలి. అలా ఏర్పడ్డ పాకిస్తాన్ ఉగ్రవాదుల ముఠాలకు కేంద్రంగా, ఉగ్రవాదుల తయారీ కేంద్రంగా తయారు కావడం గుర్తించు కుంటే మంచిది. తమ దేశాన్ని చక్కదిద్దుకుంటే మంచిది. దేశాన్ని అభివృద్ది పథంలో పయనించేలా చేసుకుంటే మంచిది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# బిలావల్ భుట్టోకు వ్యతిరేకంగా బిజెపి ఆందోళన



(మొదటి పేజి తరువాయి) తప్పదని బీజేపీ నేతలు హెచ్చరిక చేశారు.. ఈ మేరకు బీజేపీ కార్యకర్తలు ఢిల్లీలోని ఆ దేశ రాయబార కార్యాలయం దగ్గర పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారీ నిరసన చేపట్టారు. ప్లకార్డులు చేతబట్టి.. పాకిస్తాన్ డౌన్ డౌన్, బిలావల్ భుట్టో జర్దారీ క్షమాపణలు చెప్పాలంటూ నినాదాలు చేశారు. బీజేపీ నిరసనల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాక్ రాయబార కార్యాలయం వైపు ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలను ఢిల్లీ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. బారికేడ్లను ఏర్పాటు చేయగా వాటిని ఛేదించుకుని ఎంబసీ వైపు బీజేపీ కార్యకర్తలు పరుగులు తీశారు. నిరసనలు ఉద్రిక్తంగా మారడంతో.. పలువురు బీజేపీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. న్యూయార్క్ వేదికగా బిలావల్ చేసిన వ్యాఖ్యలను భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ గట్టిగా తిప్పికొట్టారు. పాక్ మంత్రి తన అసహనాన్ని స్వదేశంలో ఉన్న ఉగ్రవాదాన్ని జాతీయ విధానంగా పెంచి పోషిస్తున్న సూత్రధారుల వైపు మళ్లిస్తే బాగుంటుందని సూచించారు. ఒసామాబిన్ లాడెన్‌ను అమరవీరుడని కీర్తిస్తూ లఖ్వీ, హాఫీజ్ సయీద్, మసూద్ అజర్, దావుద్ ఇబ్రహీం వంటి అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇచ్చిన దేశంగా పాక్‌ను విమర్శించారు. ఐక్యరాజ్య సమితి గుర్తించిన 126 మంది ఉగ్రవాదులు, 27 ఉగ్రవాద సంస్థలు గల దేశం ప్రపంచంలో మరొకటి ఉండదని బాగ్చీ అన్నారు. ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్న పాక్ 'ఉగ్రవాద కేంద్రం'గా మారిందంటూ గురువారం న్యూయార్క్‌లోని ఐరాస భద్రతా మండలి సమావేశంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ పరోక్షంగా ఎండగట్టారు. దీనికి స్పందనగా బిలావల్ 'గుజరాత్‌లో ఊచకోతకు కారకుడు (బుచర్ ఆఫ్ గుజరాత్)'గా మోడీని దూషించారు. ప్రధాని పై ఇష్టానుసారంగా మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ హెచ్చరించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పాకిస్థాన్ అంటేనే ఉగ్రవాదుల దేశమన్నారు. మోదీ టెర్రరిస్ట్ కాదని... గుజరాత్ అల్లర్లలో మోదీని అమెరికా రాకుండా చేస్తే సుప్రీం తీర్పు తర్వాత రెడ్ కార్పెట్‌తో అమెరికా స్వాగతం పలికిందని గుర్తుచేశారు. పాక్ విమర్శలపై ప్రతి భారతీయుడు స్పందించాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# బాలుర జువైనల్ హోమ్‌లో పెట్రోల్ బంకు

### నిర్మాణానికి మంత్రి సత్యవతి శంకుస్థాపన



హైదరాబాద్,డిసెంబర్17(సమ సమాజం): తెలిసీతెలియని వయస్సులో చేసిన తప్పులకు శిక్షలు అనుభవిస్తూ, జువైనల్ హోమ్స్ లలో కాలం గడుపుతున్న పిల్లల జీవితాలకు ఉపాధి కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజుల రామారం బాచుపల్లి మెయిన్ రోడ్ లో ఉన్న బాలుర జువైనల్ హోమ్ లో కొత్తగా పెట్రోల్ బంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీని ద్వారా జువైనల్ హోమ్ లో శిక్ష అనుభవిస్తున్న పిల్లలకు ప్రభుత్వం తరుపున నెలకు రూ.16 వేలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యవతి రాథోడ్ తో పాటు ఎమ్మెల్సీ సురభివాణి, ఎమ్మెల్యే వివేకానంద హాజరయ్యారు. మరోవైపు బీజేపీపై మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో జాతీయ దర్యాప్తు సంస్థలు నడుస్తున్నాయని, రెండు రోజుల ముందు బీజేపీ నాయకులు చెప్పేది రాష్ట్రంలో జరుగుతోందని ఆరోపించారు.

# విద్యార్థినుల రక్షణకు ప్రత్యేక చట్టం

### మాదక ద్రవ్యాల వ్యతిరేక సదస్సు సిపి ఆనంద్



హైదరాబాద్, డిసెంబర్ 17 (సమ సమాజం): తెలంగాణ ప్రభుత్వం త్వరలో విద్యాసంస్థల్లో అమ్మాయిల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురానుందని హైదరాబాద్ సీపీ ఆనంద్ తెలిపారు. ఓయూ ఠాగూర్ స్టేడియంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ స్కూల్స్, కాలేజీల్లో అమ్మాయిలపై అఘాయిత్యాల నివారణకు ప్రత్యేక చట్టం తేనున్నట్లు ప్రకటించారు. త్వరలోనే ప్రత్యేక చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం తీసుకువస్తుందని చెప్పారు. డీపీఎ స్కూల్‌లో జరిగిన ఘటన తర్వాత చట్టంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే స్కూల్స్, కాలేజీల్లో చిన్నారులు, యువతులపై అఘాయిత్యాలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాంటీ డ్రగ్స్ కమిటీల మాదిరిగానే ఈ చట్టం పని చేస్తుందన్నారు. దేశంలో మాదక ద్రవ్యాల వినియోగిస్తున్న వారి సంఖ్య 11కోట్లుగా ఉందని తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు సైతం మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. దశాబ్ద క్రితం ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా కళాశాలల్లో కమిటీలు వేశామని, కమిటీలతో ఎన్నో మంచి ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం మాదక ద్రవ్యాలను నిరోధించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక కమిటీల్లో విద్యార్థులను చేర్చాలన్నారు. గోవా డ్రగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, గోవాలో ఉండి హైదరాబాద్‌లో డ్రగ్స్ అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# పోలీసు ఉద్యోగార్థులను పట్టించుకోండి

### సిఎం కెసిఆర్‌కు రేవంత్ బహిరంగ లేఖ



హైదరాబాద్,డిసెంబర్17(సమ సమాజం): ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలపై సీఎం కేసీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. 8 ఏళ్ల టీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు తీవ్ర నిరాశ మిగిల్చారని విమర్శించారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు మార్కులు కలపాలని.. హైకోర్టు తీర్పు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అభ్యర్థులు తమ ఆవేదనను ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ , డీజీపీ కి విన్నవించుకున్నా సమాధానం రాలేదన్నారు. సంబంధిత శాఖను చూస్తే అసలు హోంమంత్రి ఉన్నారో లేదో తెలియదన్నారు. ఇవేమీ పట్టనట్టు సీఎం బీఆర్ఎస్ అంటూ దేశమంతా తిరుగుతున్నారని, పాలన ఈ విధంగా ఉంటే ఉద్యోగార్థుల సమస్యను తీర్చేదెవరని ప్రశ్నిస్తూ లేఖ రాశారు. హైకోర్టు ఆదేశించిన ప్రిలిమినరీ పరీక్షలోని 7 ప్రశ్నలను తొలగించి.. అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం హైకోర్టు తీర్పును అమలు చేస్తే దాదాపు 50-60 వేల మంది అభ్యర్థులకు ఫిజికల్ టెస్టులకు హాజరయ్యే అవకాశం లభిస్తుందని రేవంత్ రెడ్డి ఆ లేఖలో పేర్కొన్నారు.

# ముగిసిన బాలిక ఇందు అంత్యక్రియలు





(మొదటి పేజి తరువాయి) బయటికెళ్లిన చిన్నారి దమ్మాయిగూడ చెరువులో శవమై తేలిన సంగతి తెలిసిందే. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. బాలిక మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. జవహర్‌నగర్ శ్మశానవాటికలో కుటుంబసభ్యులు కడసారి వీడ్కోలు పలికారు. అంత్యక్రియల సమయంలో దమ్మాయిగూడలో భారీగా పోలీసుల మోహరించారు. గీతల నరేష్, లక్ష్మి దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం జవహర్‌నగర్‌కు వచ్చారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఎన్‌టీఆర్‌నగర్‌లో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దమ్మాయిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పెద్ద కుమార్తె 10వ తరగతి, కుమారుడు 7వ తరగతి, చిన్న కుమార్తె ఇందు(10) 4వ తరగతి చదువుతున్నారు. రోజూలాగే గురువారం ఉదయం 9 గంటలకు నరేష్ పిల్లలను స్కూలు వద్ద వదిలి వెళ్లాడు. అయితే స్కూల్‌కు వెళ్లిన ఇందు మధ్యలోనే బయటకు వచ్చింది. క్లాస్‌టీచర్ పిల్లల హాజరు తీసుకునే సమయంలో ఇందు లేకపోవడంతో పిల్లలను ఆరా తీశారు. 24 గంటల తర్వాత దమ్మాయిగూడ చెరువులో ఇందు శవమై తేలింది. అయితే బాలిక మృతి పట్ల తల్లిదండ్రులు, బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల తీరు అనుమానాస్పదంగా ఉందని ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా బాలిక మృతిపై ముమ్మర దర్యాప్తు చేపట్టారు.

# భారత్ సూపర్ పవర్‌గా ఎదగడమే లక్ష్యం

### దేశ రక్షణతో పాటు..ప్రపంచశాంతికి అవసరం

### రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి



న్యూఢిల్లీ,డిసెంబర్17(సమ సమాజం): ప్రపంచ సంక్షేమం కోసం భారత్ సూపర్ పవర్‌గా ఎదగాలని కోరుకుంటున్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. ఇతర దేశాలపై ఆధిపత్యం కోసమో..లేక ఇతర దేశాల భూభాగాలను స్వాధీనం చేసుకోవడం కోసమో తాము...సూపర్ పవర్ గా మారాలనుకోవడం లేదన్నారు. ఢిల్లీలో జరిగిన ఈఎఅఅఎ 95వ వార్షిక సదస్సులో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్‌ను సూపర్ పవర్‌గా మార్చడానికి అవసరమైన ఐదు అంశాలను ప్రధాని మోడీ తన ఎర్రకోట ప్రసంగంలో వెల్లడించినట్లు తెలిపారు. దేశ రక్షణ కోసం సైనికులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తిస్తున్నారని రాజ్ నాథ్ సింగ్ కొనియాడారు. గల్వాన్ లేదా తవాంగ్ ..ఏ ప్రాంతమైనా..జవాన్లు తమ శౌర్య పరాక్రమాలను నిరూపించుకున్నారని చెప్పారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని..సైనికులు ప్రదర్శిస్తున్న ధైర్య సాహసాలు ప్రశంసనీయమన్నారు. చైనా యుద్దానికి సిద్ధమవుతుంటే భారత ప్రభుత్వం నిద్ర పోతోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై రాజ్ నాథ్ సింగ్ స్పందించారు. విపక్షాల ఉద్దేశం ఏంటో తాము ఎప్పుడూ ప్రశ్నించలేదన్నారు. ఏ పార్టీ అయినా..వారి పార్టీల విధానాలు వాస్తవాలపై ఆధారపడి ఉండాలన్నారు. కానీ అవాస్తవాలను ప్రచారం చేస్తూ రాజకీయాలు చేయకూడదని రాజ్ నాథ్ సింగ్ సూచించారు.

# కొల్లాపూర్‌కు హార్టికల్చర్ కాలేజీ మంజూరు




హైదరాబాద్,డిసెంబర్17(సమ సమాజం): నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలానికి హార్టికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొల్లాపూర్‌కు ఉద్యానవన పాలిటెక్నిక్ కాలేజీ మంజూరు కావడంపై ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, నిరంజన్ రెడ్డికి హర్షవర్ధన్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీని విస్తరణ


### త్రీ డీ మంత్రలో భాగంగా జిల్లా కేంద్రాల్లో ఐటీ హబ్‌లు

### రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్



హైదరాబాద్,డిసెంబర్17(సమ సమాజం): రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీని విస్తరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. ఈ క్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఐటీ హబ్‌ల ఏర్పాటునకు విశేషంగా కృషి చేస్తున్నారు. త్రీ డీ మంత్రలో భాగంగా జిల్లా కేంద్రాల్లో ఐటీ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. ప్రస్తుతం ప్రపంచమంతా త్రీ'డీ'.. అంటే, డిజిటైజేషన్, డీకార్బనైజేషన్, డీసెంట్రలైజేషన్ విధానంలో దూసుకుపోతోందని, ఈ త్రీడీమంత్ర కొత్త అవకాశాలను, సృజనాత్మక విధానాలను ప్రోత్సహిస్తుందని కేటీఆర్ పలు సందర్భాల్లో పేర్కొంటున్న సంగతి తెలిసిందే. వరంగల్, ఖమ్మం, కరీంనగర్‌లో ఐటీ హబ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, సిద్దిపేట, ఆదిలాబాద్ జిల్లాల్లోనూ త్వరలోనే ఐటీ హబ్‌లు ప్రారంభమవుతాయని ప్రకటించారు. ఆయా జిల్లాల్లో ఏర్పాటవుతున్న ఐటీ హబ్‌ల ఫోటోలను కేటీఆర్ షేర్ చేస్తూ, పనుల పురోగతిని వివరించారు. నిజామాబాద్‌లో ఐటీ హబ్ దాదాపు పూర్తయింది.. త్వరలోనే ప్రారంభిస్తామని కేటీఆర్ తెలిపారు. ఐటీ హబ్ కోసం కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే బిగాల గణెళిశ్‌ను కేటీఆర్ అభినందించారు. ఇక స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పెట్టుబడులు తీసుకురావడంలో కృషి చేస్తున్న మహేశ్ బిగాలను కూడా కేటీఆర్ అభినందించారు. మహబూబ్‌నగర్‌లోనూ ఐటీ హబ్ పూర్తయిందని, ఒక నెల రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. ఈ ఐటీ హబ్ పూర్తయ్యేందుకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. సిద్దిపేట ఐటీ హబ్ కూడా మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో చక్కటి నిర్మాణంతో రూపుదిద్దుకుంటుందని తెలిపారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్ ఐటీ హబ్‌లను ప్రారంభించిన అనంతరం దీన్ని కూడా ప్రారంభిస్తామని చెప్పారు. నల్లగొండ ఐటీ హబ్ కూడా నిర్మాణంలో ఉందని, 4-6 నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ హబ్ నిర్మాణం పూర్తయ్యేందుకు కృషి చేస్తున్న మంత్రి జగదీశ్ రెడ్డికి, ఎమ్మెల్యే భూపాల్ రెడ్డికి కేటీఆర్ థ్యాంక్స్ చెప్పారు.

# హెటిరో పరిశ్రమలో చిరుత కలకలం



(మొదటి పేజీ తరువాయి) చిరుత ప్రవేశించిన విషయాన్ని అటవీ అధికారులకు వీరు సమాచారం ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా జిన్నారంలో చిరుతపులి కలకలం సృష్టిస్తున్నది. గడ్డపోతారం పారిశ్రామిక వాడలో ఉన్న హెటిరో ల్యాబ్స్‌లో చిరుత సంచరిస్తున్నది. పరిశ్రమలోని హెచ్ బ్లాక్‌లో దాక్కున్నది. దీంతో ఉద్యోగులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది హెటిరో పరిశ్రమకు చేరుకుని గాలింపు చేపట్టారు. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు కంపెనీలోకి ప్రవేశించినట్లు అధికారులు తెలిపారు. చిరుత సంచారం దృష్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ య్యాయని చెప్పారు. జిల్లా అటవీ అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. చిరుతను బంధించేందుకును బోన్ ఏర్పాటు చేశారు. ఎవరూ బయటకు రావొద్దని సూచించారు. మూడు నెలల క్రితం కూడా చిరుత కంపెనీలో సంచరించినట్లు సీసీటీవీల్లో రికార్డయింది.

# తెలుగు ఖ్యాతిన, సంస్కృతి విశ్వవ్యాప్తం

(మొదటి పేజీ తరువాయి) ఇస్తూ.. కళాకారులను గుర్తించి వారిని సత్కరించడం గర్వంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కన్నా అమెరికాలోనే తెలుగు వెలుగుతోందని, మాతృభాష అభివృద్ధి కోసం ప్రవాసులు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఇక్కడున్న తెలుగువారు వారిని ఆదర్శంగా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. పిల్లలు మాతృభాషలో మాట్లాడేలా చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలని కోరారు. ఇతర భాషలు నేర్చుకోవడంలో తప్పులేదన్న వెంకయ్య.. అమ్మభాషను మరిచిపోరాదని, మాతృభాషలో చదవడం వల్ల ఉన్నత పదవులు రావన్న భావన వద్దని చెప్పారు. ప్రస్తుత రాష్ట్రపతి, ప్రధాని, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ మాతృభాషలోనే చదువుకుని ఉన్నత పదవులను చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కళామతల్లి ముద్దు బిడ్డలు కృష్ణవేణి, కోట శ్రీనివాసరావు, మురళీమోహన్, గిరిబాబు, గాయని సుశీల, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, కోదండరామిరెడ్డి వంటి వారిని వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సత్కరించారు. ఉత్తర అమెరికాలో స్థిరపడ్డ తెలుగు వారి కోసం ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఏర్పాటైన ప్రసిద్ధ సంస్థ తానా. ఈ సంఘం1978లో అధికారికంగా ఏర్పాటైంది. అయితే తానా మొదటి జాతీయ సమావేశం ఒక ఏడాది ముందే 1977లో జరిగింది. అమెరికాలో నివసిస్తున్న తెలుగు వారికి ఏదైనా ఆపద వచ్చినా, సమస్యలు వచ్చినా తానా ఆదుకుంటోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల వారికి అండగా పలు సేవా కార్యక్రమాలు చేస్తోంది. అమెరికాలో ఉన్న తెలుగువారందరిని ఒక చోటకు చేర్చి కుటుంబ వేడుకగా ప్రతి సంవత్సరం మూడు రోజులపాటు తానా ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది ప్రత్యేకంగా అక్కడ వారు చేసే కార్యక్రమాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో జరుపుకోవాలని నిర్ణయించారు. సుమారు 10 కోట్ల రూపాయలతో డిసెంబర్ 2 నుండి జనవరి 4వరకు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం 'తానా కళారాధన' పేరిట తెలుగు సినీ రంగంలో విశేష కృషి చేసిన సీనియర్లకి హైదరాబాద్ శిల్పకళా వేదికగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

# గుట్టుచప్పుడు కాకుండా కల్తీ మద్యం విక్రయం

(మొదటి పేజీ తరువాయి) దాడి చేసి నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ఒడిశా రాష్ట్రం నుంచి ఒక లారీలో 300 కాటన్‌ల మద్యాన్ని తీసుకువచ్చి హయత్‌నగర్ రేడియో స్టేషన్ సమీపంలో ఓ రేకుల గదిలో డంపు చేసినట్లు తెలిసింది. ఎక్సైజ్ అధికారులు, వినియోగదారులు గుర్తించకుండా తెలంగాణ ప్రభుత్వ ఎక్సైజ్ స్టిక్కర్లను బాటిళ్లకు అంటించి బెల్టుషాపులకు సరఫరా చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం, చౌటుప్పల్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలలోని బెల్టు షాపులను ఎంచుకుని విక్రయిస్తున్నట్లు సమాచారం. యాచారం మండలంలోని మంతని గౌరెల్లిలో ఓ మద్యం ప్రియుడు నకిలీ మద్యాన్ని గుర్తించి ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కూపీ లాగారు. దీంతో అసలు విషయం బయట పడింది. బాటిళ్లకు అంటించిన నకిలీ స్టిక్కర్‌లు స్కాన్ కాకపోవడంతో అవి కూడా నకిలీవని తేలడంతో జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. యాచారంలోని బెల్టు షాపు నిర్వాహకుడి ద్వారా అసలు వ్యక్తిని హయత్‌నగర్‌లో పట్టుకున్నట్లు తెలిసింది. రెండు రోజులుగా హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీసులు చౌటుప్పల్ మండలంలోని దేవలమ్మ నాగారం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, యాచారం మండలాలలో అక్రమ, నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకుని పలువురిని అదుపులోనికి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. హయత్‌నగర్‌లో డంపు చేసిన మద్యాన్ని కూడా ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నకిలీ, అక్రమ మద్యం డంపు వెనుక బడా మద్యం వ్యాపారులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

# మాకు నోటీసులు వస్తాయని ముందే ఎలా తెలుసు



(మొదటి పేజీ తరువాయి)నిజంగా హిందువాది అయితే రేపు భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంకు ఆదారలతో రావాలి. నాకు డ్రగ్స్ కేసులో నోటీసులు వచ్చాయని చెప్తున్న బీజేపీ ఆధారాలు చూపించాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు సవాల్ విసరిరారు. దమ్ముంటే ఆదివారం ఉదయం 10 గంటలకు భాగ్యలక్ష్మి ఆలయం వద్దకు రావాలని సవాల్ విసిరారు. భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా కర్ణాటక కేసుపై ప్రమాణం చేద్దామని చెప్పారు. దమ్ముంటే సంజయ్ తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. ఈడీ, సీబీఐ దాడులకు భయపడం అని రోహిత్ రెడ్డి తేల్చిచెప్పారు. శనివారం ఉదయం భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రోహిత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ కోసం అనుక్షణం పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో బీజేపీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. ఈడీ నోటీసులు చూసి లాయర్లే ఆశ్చర్యపోతున్నారు. ఈడీ నోటీసుల్లో తన వ్యక్తిగత బయోడేటా మాత్రమే అడిగారని తెలిపారు. తన బయోడేటా పబ్లిక్ డొమైన్లో దొరుకుతుంది. దానికి నోటీసులు ఇవ్వాలా అని అడిగారు. న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉందన్నారు. ఈడీ నోటీసులపై న్యాయపోరాటం చేస్తాం. తప్పుడు ఆరోపణలు చేయడం బీజేపీ నాయకులకు అలవాటుగా మారిందని రోహిత్ రెడ్డి ధ్వజమెత్తారు. ఈడీ నోటీసులకు సంబంధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై టీఆర్ఎస్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి సవాల్ విసిరారు. శనివారం ఉదయం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే.. పూజలు చేసి అమ్మవారి సాక్షిగా సవాల్ చేశారు. బండి సంజయ్ తడి బట్టలతో రేపు భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంకు రావాలన్నారు. నాకు డ్రగ్స్ కేసులో నోటీసులు వచ్చినట్లు చూపించు. బండి సంజయ్‌కు తంబాకు వల్ల నోరు తిరుగతలేదు. నాకు సోమవారం ఈడీ ఆఫీస్‌కు రావాలని ఈడీ నోటీస్ ఇచ్చారు. నా బయోడేటా కోసమే ఈడీ నోటీసు ఇచ్చింది. రేపు బండి సంజయ్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంకు రాకపోతే... మొన్నటి దొంగస్వాములకు నీకు తేడా ఉండదు. ఎమ్మెల్సీ కవితకు కూడా నోటీసులు వస్తాయని బీజేపీ ముందే ఎలా చెప్పిందని అంటూ పైలెట్ రోహిత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# నేడు ఈశాన్య రాష్ట్రాల్లో మోడీ పర్యటన



(మొదటి పేజీ తరువాయి) కింద త్రిపురలోని అగర్తలాలో రెండు లక్షల మందికి పైగా లబ్దిదారుల కోసం 'గృహ ప్రవేశ్'ను మోదీ ప్రారంభించనున్నారు. 1072 నవంబర్ 7న నార్త్-ఈస్ట్ కౌన్సిల్ ఈశాన్య మండలిని అధికారికంగా ప్రారంభించారు. ప్రాంతీయంగా వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం ద్వారా సామాజిక-ఆర్థిక అభివృద్ధిలో ఈశాన్య మండలి గణనీయమైన పాత్ర పోషించిందని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. ఇంకా విద్య, ఆరోగ్యం, క్రీడలు, నీటి వనరులు, వ్యవసాయం, పర్యాటకం, పరిశ్రమలు వంటి రంగాలలో విలువైన మూలధనం, సామాజిక మౌలిక సదుపాయాలను సృష్టించేందుకు ఈశాన్య మండలి కృషిచేసిందని కూడా ప్రధాని కార్యాలయం పేర్కొంది. మోదీ తన పర్యటనలో భాగంగా 2450 కోట్లకు పైగా విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారని ప్రధాని కార్యాలయం తెలిపింది. అలాగే మోడీ మేఘాలయ, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో నాలుగు రోడ్డు ప్రాజెక్టులతో సహా అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. వాటితో పాటు త్రిపురలోని ఉమ్సావలిలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ షిల్లాంగ్‌ను మోదీ ప్రారంభించనున్నారు. అలాగే మేఘాలయలోని మష్రూమ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో స్పాన్ లాబొరేటరీ అండ్ ఇంటిగ్రేటెడ్ తేనెటీగల పెంపకం అభివృద్ధి కేంద్రాన్ని కూడా ప్రధాని ప్రారంభిస్తారని ప్రధాని కార్యాలయం తెలిపింది. దీంతో పాటు మిజోరాం, మణిపూర్, త్రిపుర, అస్సాంలలో 21 హిందీ గ్రంథాలయాలను కూడా ఆయన ప్రారంభించ నున్నారు. త్రిపురలో సుమారు రూ.4350 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రారంభించనున్నారు. ప్రధాన్ మంత్రి గ్రామ సడక్ యోజన కింద 230 కి.మీ కంటే ఎక్కువ పొడవుతో మొత్తం 32 రోడ్లకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. వాటితో పాటుగానే 540 కి.మీ కంటే ఎక్కువ దూరాన్ని కవర్ చేసే 112 రోడ్లను మెరుగుపరచేందుకు మరో ప్రాజెక్ట్‌కు మోదీ శంకుస్థాపన చేస్తారు. ఆనంద్‌నగర్‌లో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, అగర్తల ప్రభుత్వ డెంటల్ కాలేజీకి కూడా ప్రధాని శ్రీకారం చుట్టనున్నారు. కాగా, వచ్చే ఏడాది ప్రారంభంలో అంటే మార్చి నెలలో త్రిపుర, మేఘాలయ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక త్రిపురలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలో ఉండగా.. మేఘాలయలో బలాన్ని పెంచుకునేందుకు ఆ పార్టీ కసరత్తు చేస్తోంది. ఈ రెండు రాష్ట్రాలతో నాగాలాండ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరాం, రాజస్థాన్, తెలంగాణల్లో కూడా 2023లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

# కాంగ్రెస్ సీనియర్ల సేవ్ కాంగ్రెస్ నినాదం



(మొదటి పేజీ తరువాయి) నేతలు భేటీ అయ్యారు. ఇటీవలి కమిటీ కూర్పుపై చర్చించారు. టీడీపీ నుంచి వచ్చిన వాళ్లకే కొత్త కమిటీల్లో చోటు కల్పించారని కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కడదాకా కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. కొంత మంది పార్టీకి అన్యాయం చేస్తున్నారని తెలిపారు. కొంతమందిని అవమానపర్చేందుకే కమిటీలు నియమించారని విమర్శించారు. కాంగ్రెస్‌ను రక్షించేందుకునే బాధ్యత సీనియర్లపైన ఉందన్నారు. కమిటీల్లో 108 మందిలో 54 మంది వలస నేతలేనని గుర్తుచేశారు. కమిటీల కూర్పుపై మరోసారి హైకమాండ్‌ను కలుస్తామని తెలిపారు. అసలైన కాంగ్రెస్‌నేతలను కోవర్టులని ప్రచారం చేస్తున్నారని, కొంతమంది కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని కాంగ్రెస్ నేత దామోదర్ తెలిపారు. వలస వచ్చిన నేతలకే కమిటీల్లో పదవులు ఇచ్చారని, సోషల్ మీడియాలో కోవర్టులని ప్రచారం చేస్తున్నారని దామోదర్ విమర్శించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిస్థితి, పరిణామాలను హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నేత దామోదర రాజ నర్సింహ్మ అన్నారు. అందరితో మమేకమవుతూ.. కాంగ్రెస్ పార్టీని కాపాడు కునే దిశగా తమ ప్రయత్నం ఉంటుందని చెప్పారు. పార్టీని బలోపేతం చేసే దిశగా తాము ఎప్పుడూ ప్రయత్నం చేస్తామన్నారు. మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పినట్లు సోషల్ మీడియాలో తమను తప్పు పడుతున్నారని చెప్పారు. నాలుగు పార్టీల్లో తిరిగి వచ్చిన చరిత్ర తమది కాదన్న దామోదర రాజ నర్సింహ్మ... కాంగ్రెస్‌లో పుట్టినం.. కాంగ్రెస్ లో పెరిగినం.. కాంగ్రెస్ లోనే చస్తాం అని తెలిపారు. కాంగ్రెస్ లో ఉంటూ పార్టీ కార్యకర్తలకు ఈ విధంగా అన్యాయం జరుగుతుంటే.. వారిని కాపాడే దిశగా తమ ప్రయత్నం చేస్తామని వివరించారు. క్యారెక్టర్ లేనివాళ్లు పార్టీని నడిపిస్తున్నారు కుట్రపూరితంగా పార్టీని నాశనం చేసే ప్రయత్నం జరుగుతోందని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ అన్నారు. క్యారెక్టర్ లేనివాళ్లు పార్టీని నడిపిస్తున్నారని, తమను ప్రశ్నించే స్థాయి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలస వచ్చినోళ్లకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ రోజు పంచాయతీ వచ్చిందన్నారు. ఇదంతా పార్టీని నాశనం చేసే ప్రయత్నమేనని ఆరోపించారు. సీఎల్పీ నేతను విస్మరించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదన్న మధుయాష్కీ.. అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరిగిందని వాపోయారు. కాంగ్రెస్ పార్టీని ఇతరులకు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతోందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. పార్టీని కాపాడేందుకు సేవ్ కాంగ్రెస్ కార్యక్రమం చేపడుతామన్నారు. పార్టీని నమ్ముకొని పని చేసిన వారికి కమిటీల్లో అవకాశం రాలేదని తెలిపారు. ఈ విషయంలో తాను కూడా తీవ్ర మనస్థాపానికి గురైనట్లు చెప్పారు. కొందరు సోషల్ మీడియా లో సీనియర్ నేతలను కించపరిచేలా పోస్టులు పెడుతూ పార్టీని బలహీన పరుస్తున్నారని మండిపడ్డారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి పదవులు కట్టబెట్టారని కొందరు నేతలు తనతో చెప్పారని.. అయితే కమిటీల నియామకంలో తాను పాలుపంచుకోలేదని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కాంగ్రెస్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సేవ్ కాంగ్రెస్ నినాదంతో ముందు కెళ్తామని.. దేశవ్యాప్తంగా పార్టీని కాపాడుకుంటామని చెప్పారు.
కుట్రపూరితంగా పార్టీని నాశనం చేసే ప్రయత్నం జరుగుతోందని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ అన్నారు. క్యారెక్టర్ లేనివాళ్లు పార్టీని నడిపిస్తున్నారని, తమను ప్రశ్నించే స్థాయి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలస వచ్చినోళ్లకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ రోజు పంచాయితీ వచ్చిందన్నారు. ఇదంతా పార్టీని నాశనం చేసే ప్రయత్నమేనని ఆరోపించారు. సీఎల్పీ నేతను విస్మరించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదన్న మధుయాష్కీ.. అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరిగిందని వాపోయారు.
సోషల్ మీడియా ఖబర్దార్ అన్న మధుయాష్కీ.. తమపై తప్పుడు ప్రచారం చేయకండని అభ్యర్థించారు. పీజేఆర్ కుమారుడు విష్ణు అవకాశం ఇవ్వరా..? అని ప్రశ్నించారు. విష్ణుకు అనుకూలంగా అలోచించి వార్తలు రాయండని కోరారు. తమకు పదవులు కాదు..పార్టీని నమ్ముకొని ఉన్న వాళ్లకు పదవులు ఇవ్వాలని అడుగుతున్నామని కోరారు. కాంగ్రెస్ పార్టీని రక్షించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# జగిత్యాల డిపోలో సజ్జన్నార్ తనిఖీలు



(మొదటి పేజీ తరువాయి) నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ కార్గో సెంటర్ ను ఆయన సందర్శించారు. ఆర్టీసీలో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చిన కార్గో సేవలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా కార్గోలో సేవలు అందిస్తున్న సిబ్బందిని సజ్జనార్ అభినందించారు. రానున్న రోజుల్లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా వినూత్న కార్యక్రమాలను ఆర్టీసీలో ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్?లో ఉన్న ప్రయాణికులు, కండక్టర్స్ తో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

# విభజనతో పాటే కాశ్మీర్ చిచ్చు

(మొదటి పేజీ తరువాయి)ఉండాలి. కానీ పాక్ పాలకు తీరు, నాటి భారత్ పాలకుల ముందు చూపు లేకపోవడం కారణంగా నేటికి దానిని రావణ కాష్టంగా మార్చేశాయి. బ్రిటిష్ పాలకులు దేశాన్ని విభజించడమే కాకుండా.. అనేక మెలికలు పెట్టి వెళ్లారు. అలాంటి దాంట్లో కాశ్మీర్ సమస్య ఒకటి నేటికీ అది రావణకాష్టంగా మారడానికి కారణం వారి కుత్సిత రాజకీయ తంత్రమే. వెళుతూవెళుతూ సంస్థానాలను వారి స్వేచ్ఛకు వదిలేసి వెళ్లారు. ఇదే క్రమంలో భారత్ ఆశ్రయం పొంది భారత్‌లో విలీనం కావడానికి కాశ్మీర్ రాజు హరిసింగ్ చేసిన ప్రయత్నాలను విభజిత పాక్ అడ్డుకుంది. కొంత భాగాన్ని ఆక్రమించడంతో దిక్కులేని స్థితిలో కాశ్మీర్ రాజు భారత్ ఆశ్రయం పొందాడు. పాకిస్థాన్‌లోని ప్రభుత్వం ఆక్రమిత కశ్మీర్ భాగంలోని గిరిజనులను ఉసిగొలిపితే కశ్మీర్ రాజు హరిసింగ్.. నాటి నెహ్రూ ప్రభుత్వాన్ని శరణు కోరారు. తర్వాత మిలిటెంట్ల చొరబాట్లు, పాక్ సైన్యం అకారణంగా కాల్పులు జరుపడం నిత్యకృత్యంగా మారింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల పెరుగుదలకు దారి తీసింది. మత ఘర్షణల నివారణకే దేశ విభజన వందేండ్ల పోరాటం తర్వాత భారత్ 1947లో వలస పాలకుల నుంచి విముక్తి పొందింది. బ్రిటన్ పార్లమెంట్ స్థానంలో భారత స్వాతంత్ర్య చట్టం అమలులోకి వచ్చింది. ఆగస్టు 15వ తేదీ నుంచి బ్రిటీషువారి పాలన ముగుస్తుందని ఆ చట్టం నిర్దేశించింది. అలాగే దేశాన్ని రెండు సార్వభౌమ దేశాలైన ఐక్య భారత్, అధినివేశ పాకిస్థాన్‌గా విభజించాలని సూచించింది. రెండు దేశాలకు కేటాయించ చాల్సిన ప్రాంతాల పర్యవేక్షణకు బ్రిటీషు వారు సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌ను రంగంలోకి దించారు. ఒక దేశాన్ని రెండు స్వతంత్ర దేశాలుగా విడగొట్టే గీత గీయడానికి ఈ కమిషన్‌ను నియమించారు. దేశ విభజన అనంతరం దాదాపు 1.5 కోట్ల మంది తమ నివాస ప్రదేశాలను వదిలి రాడ్‌క్లిఫ్ గీతకు అటూ ఇటూ ప్రయాణించారు. వారిలో కొందరు కాలినడకన, మరికొందరు రైళ్లలో, బస్సుల్లో రవాణా వసతి ఏది దొరికితే దానిలో గీత దాటారు. ఈ సందర్భంగా జరిగిన మతోన్మాద మారణకాండలో దాదాపు పది లక్షలమంది తమ ప్రాణాలు కోల్పోయారు. లక్షల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డాయి. వేల మంది మహిళలపై లైంగిక దాడులు జరిగాయి. దేశవిభజనతో ఒక ప్రాంతం నుంచి మరోప్రాంతానికి తరలివెళ్తున్న నిరాశ్రయు లైన జనంతో ఢిల్లీ గుడారాల నగరంగా మారిపోయింది. ఇండ్లను, పుట్టి పెరిగిన ప్రాంతాలను వదిలి, మతకల్లోలాల్లో సర్వం పోగొట్టుకొని శరణార్థులగా మారారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులదీ ఇదే పరిస్థితి. అదే సమయంలో ఢిల్లీ జనాభాలో.. వలస వచ్చిన ప్రజల సంఖ్య దాదాపు మూడోవంతు వరకు చేరుకున్నదంటే.. ఏ స్థాయిలో వలసలు జరిగాయో ఊహించుకోవచ్చు. నిట్టనిలువునా చీలిన పంజాబ్‌లోనూ ఇదే పరిస్థితి. పలు కాలేజీలు వలస ప్రజల శిబిరాలుగా మారిపోయాయి. కనీస సౌకర్యాలు లేక, ఆహారం లేక జనం అలమటించిపోయారు. ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ ఆహారం రోజుకు ఒక చపాతీకి తగ్గించారు. ఆకలితో అల్లాడి వేల మంది మరణించారు. ఇంతటి దారుణం తరవాత కూడా పాక్ భారత్‌తో యుద్ధం చేసి ఓడిపోయింది ఆనాడే ఆక్రమిత కాశ్మీర్ సంగతి తేల్చి వుంటే ఇవాళ ఈ గతి ఉండేది కాదని చరిత్రకారులు అంటారు.

# ఇండియన్ లైబ్రరీ కాంగ్రెస్‌కు కవితకు ఆహ్వానం


(మొదటి పేజీ తరువాయి) ఇండియన్ లైబ్రరీ కాంగ్రెస్ సమావేశాలను జనవరి 1న కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, బీహార్‌తోపాటు వివిధ రాష్ట్రాల నుంచి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.



# వైద్య రంగంలో తెలంగాణ అగ్రగామి

(మొదటి పేజీ తరువాయి) చెప్పారు. కొత్తగా వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తెలుసు కోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో ఆరోగ్యశ్రీ కింద ఒక్క రూపాయి ఖర్చుపెట్టకుండా పేద ప్రజలకు సింగిల్ యూజ్ ఫిల్టర్ సిస్టం ద్వారా డయాలసిస్ అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజు 10 వేల మందికి డయాలసిస్ చేస్తున్నామని వెల్లడించారు. డయాలసిస్ చేయించుకునేవారికి బస్‌పాస్, పెన్షన్లు, ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. డయాలసిస్‌పై ప్రభుత్వం ఏటా రూ.100 కోట్లు వెచ్చిస్తున్నదని చెప్పారు. పేదలకు కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రతిఏటా ఆరోగ్య శ్రీ కింద రూ.1000 కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. అత్యాధునిక వైద్య పరికరాల కోసం రూ.150 కోట్లు మంజూరు చేశామన్నారు. శుద్ధిచేసిన తాగునీరు అందిస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ప్రాథమిక దశలోనే గుర్తించి రోగాలు రాకుండా చూసుకోవాలన్నారు. కిడ్నీట్రాన్స్‌ఎ÷-లాంటేషన్లు అత్యధికంగా నిమ్స్‌లో జరుగుతున్నాయన్నారు. నిమ్స్‌ను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. దవాఖానలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని వెల్లడించారు. వైద్య సిబ్బంది ఓనర్‌షిప్‌తో పనిచేయాలని, పేదలకు మంచి వైద్యం అందించాలని సూచించారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీతో పెద్ద ఎత్తున డాక్టర్లు వస్తారని చెప్పారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు నాలుగు రెట్లు పెంచామని తెలిపారు. హైదరాబాద్ బేగంపేటలో మెడికోవర్ దవాఖానను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ మెడికల్ హబ్‌గా ఎదిగిందన్నారు. అత్యధిక ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్లు హైదరాబాద్‌లోనే జరుగుతున్నాయన్నాని చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద ప్రైవేటు దవాఖానలు మంచి వైద్యం అందించాలని సూచించారు. ఈ పథకం కింద అత్యధికంగా రూ.10 అందిస్తున్నామని, పేద ప్రజల వైద్యం కోసం ఏటా రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. కార్పొరేట్ హాస్పిటళ్లు పేదలకు మెరుగైన వైద్యం అదించాలన్నారు.

# జర్నలిస్టులు,లాయర్లు స్వతంత్రంగా ఉండాలి



(మొదటి పేజీ తరువాయి) ముంబై,డిసెబర్17(ఆర్ఎన్ఎ): దేశంలో ప్రజాస్వామ్యం సజావుగా సాగేందుకు జర్నలిస్టులు స్వతంత్ర ప్రతిపత్తిని కలిగి ఉండాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బీఎన్ శ్రీకృష్ణ పిలుపునిచ్చారు. జర్నలిజంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగానూ ముంబై ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన వార్షిక రెడ్‌ఇంక్ అవార్డులను బీఎన్ శ్రీకృష్ణ ప్రదానం చేశారు. న్యాయవాది, జర్నలిస్టులు తప్పనిసరిగా స్వతంత్రంగా ఉండాలని చెప్పారు. వీళ్లు సరిగా లేకపోతే ప్రజాస్వామ్యం దెబ్బతింటుందన్నారు. 'మీరు ఈ వృత్తిలో ఉన్నారంటే..నిజాయితీగా ఉండడమే ఉత్తమమైన విధానం.. ఇది గుర్తుంచుకోండి' అని శ్రీకృష్ణ అన్నారు. ఇదిలా ఉండగా సీనియర్ జర్నలిస్ట్ టీజెఎస్ జార్జ్ ఎడిటర్, కాలమిస్ట్‌గా విశిష్ట సేవలందించినందుకు ఆయనకు రెడ్‌ఇంక్ అవార్డు అందజేశారు. 1960లో మిస్టర్ జార్జ్ (94) పాట్నా-ప్రధాన కార్యాలయ వార్తాపత్రిక 'ది సెర్చ్‌లైట్'కు సంపాదకులుగా ఉన్నారు. యూపీలోని పట్టణాలు, నగరాల్లోని కొవిడ్ మరణాల విషాదాన్ని బహిర్గతం చేసిన రిపోర్టర్లు, ఫోటోగ్రాఫర్ల బృందానికి నాయకత్వం వహించినందుకుగాను 'దైనిక్ భాస్కర్' నేషనల్ ఎడిటర్ ఓం గౌర్‌కు 2021కి ప్రెస్ క్లబ్ 'జర్నలిస్ట్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది.




# చలన చిత్రం




## భారతీయుడు-2లో కమల్ మేకప్‌కే 7గంటలు

విశ్వ నటుడు కమల్ హాసన్ ఛాలెంజింగ్ క్యారెక్టర్స్ చేయడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఇందుకోసం ఎంత రిస్క్‌కు అయినా కమల్ రెడీ. ఇప్పటికే ఎన్నో ప్రయోగాత్మక సినిమాలతో ఆకట్టుకున్న ఆయన, ప్రస్తుతం 'ఇండియన్ 2'లో నటిస్తున్నారు. శంకర్ డైరెక్ట్ చేస్తోన్న ఈ సీక్వెల్‌లో తొంభై ఏళ్ల 'సేనాపతి' పాత్రలో కనిపించబోతున్నారు. ఇందుకోసం ప్రోస్తెటిక్ మేకప్ వేసుకోడానికి ఐదు గంటలు, తీయడానికి రెండు గంటల టైమ్ పడుతుంది. కేవలం మేకప్‌కు ఏడు గంటలు కేటాయిస్తున్న ఆయన.. క్యారెక్టర్ కోసం స్ట్రిక్ట్ డైట్ మెయింటైన్ చేస్తున్నారట. ఫుడ్ నమిలితే మేకప్‌పై ఎఫెక్ట్ పడుతుందని జ్యూస్ డైట్‌లో ఉంటున్నారట కమల్. ఈ మూవీ రైటర్ బి.జయమోహన్ ఆ విషయాలను ఇటీవల రివీల్ చేశారు. అరవై ఎనిమిదేళ్ల వయసులో క్యారెక్టర్ కోసం ఇంతలా డెడికేషన్ చూపించడం కమల్‌కు మాత్రమే సాధ్యం అన్నారు మోహన్. గత కొద్దిరోజులుగా చెన్నై ఐటీ పార్క్‌లో షూటింగ్ జరుగుతోంది. కమల్ హాసన్, బాబీ సింహా కాంబినేషన్ సీన్స్ తీస్తున్నారు. 1920 బ్యాక్‌డ్రాప్‌లో సేనాపతి తండ్రి పాత్రను చూపించ బోతున్నారని, ఆ క్యారెక్టర్‌కు పవర్‌ఫుల్ ఎ÷-లాష్‌బ్యాక్ ఉంటుందని టాక్. దీంతో మరోసారి రెండు క్యారెక్టర్స్‌లో కమల్ కనిపించబోతున్నట్టు అర్థమవుతోంది. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, సిద్దార్థ్, సముద్రఖని ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. సుభాస్కరన్, ఉదయనిధి స్టాలిన్ కలిసి నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.



## రాధికతో మరోమారు స్టెప్పులేయనున్న చిరు

చిరంజీవి,రాధికలది సూపర్ హిట్ కాంబినేషన్. వీరిద్దరి కలయికలో ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలొచ్చాయి. చిరంజీవి పక్కన పోటీగా డాన్స్ చేయగల హీరోయిన్‌లతో రాధిక ఒకరు. వీరిద్దరి మధ్య మంచి స్నేహం ఉంది. ఈ విషయాన్ని ఇద్దరూ ఎన్నో సందర్భాల్లో చెప్పారు. అలాగే రాధిక భర్త శరత్‌కుమార్ కూడా చిరంజీవికి మంచి స్నేహితుడే! ఇప్పుడు చిరు-రాధికల కలయికలో ఓ చిత్రం రాబోతుందనే వార్త నెట్టింట హల్‌చల్ చేస్తోంది. అయితే చిరంజీవి పక్కన రాధిక హీరోయిన్ కాదు. నిర్మాతగా ఆమె చిరుతో ఓ చిత్రం చేయడానికి సిద్ధమయ్యారని తెలిసింది. రెండేళ్ల క్రితం చిరంజీవి పుట్టినరోజున రాధిక - శరత్‌కుమార్ ఇచ్చిన ఇంటర్వ్యూలో చిరుతో ఓ సిపిమా చేస్తామని చెప్పారు. ఇప్పుడు ఆ ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాధిక సొంత నిర్మాణ సంస్థ రాడాన్ పిక్చర్స్‌లో చిరు ఓ సినిమా చేయడానికి అంగీకరించారని సమాచారం. ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నాయి. చిరుకి తగిన కథ కోసం ఆమె ప్రయత్నాలు చేస్తున్నారట. కొన్ని రోజులుగా రాధిక కొందరు రచయితలతో చర్చలు జరుపుతున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. చిరంజీవి కూడా ఓ లైన్ చెప్పా అనుకున్నారని, దానిపై రచయితలతో వర్క్ చేయిస్తున్నారని తెలిసింది. మరోవైపు దర్శకుడిన్ని÷నైల్ చేసే పనిలో ఉన్నారు రాధిక. కొత్త సంవత్సరంలో ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ప్రస్తుతం చిరంజీవి వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. సంక్రాంతి కానుకగా ఆయన నటించిన 'వాల్తేరు వీరయ్య' చిత్రం జనవరి 13న విడుదల కానుంది.




## త్రిష రాంగీ మూవీ విడుదలకు సన్నాహాలు

రెండు దశాబ్దాలుగా దక్షిణాదిన స్టార్ హీరోయిన్‌గా చెలామణీ అవుతున్న కథానాయికలలో త్రిష ఒకరు. 'నీ మనసు నాకు తెలుసు' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ బ్యూటీ అనతి కాలంలోనే అగ్ర హీరోలతో జోడీ కట్టి ప్రేక్షకుల్లో విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. ఇక మధ్య ఎక్కువగా లేడీ ఓరియెంటెడ్ సినిమాలను చేస్తుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ చేతిలో అరడజను సినిమాలున్నాయి. అందులో రాంగీ ఒకటి. 'జర్నీ' ఫేం శరవణన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. అయితే గత కొన్ని రోజుల నుండి ఈ సినిమా నేరుగా ఓటీటీలో రిలీజ్ కాబోతున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా మేకర్స్ ఆ రూమర్స్‌కు చెక్ పెడుతూ రాంగీ సినిమాను డిసెంబర్ 30న థియేటర్‌లలోనే రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్లు, టీజర్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాను లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరణ్ నిర్మిస్తున్నాడు. దిగ్గజ దర్శకుడు ఏ.ఆర్ మురుగదాస్ కథ అందిస్తున్నాడు. దీనితో పాటుగా ప్రస్తుతం త్రిష నటించిన సతురంగ వె÷-ట్టై-2, పొన్నియన్ సెల్వన్-2 రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి.

## విడుదలకు సిద్ధంగా హిడింబ

'రాజుగారి గది' సిరీస్‌తో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అశ్విన్.. డిఫరెంట్ కాన్సెప్ట్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. తను హీరోగా అనీల్ కన్నెగంటి దర్శకత్వంలో రూపొందుతోన్న 'హిడింబ' చిత్రం రిలీజ్‌కి రెడీ అవుతోంది. తాజాగా అశ్విన్‌కి సంబంధించి మరో మూవీ అనౌన్స్‌మెంట్ వచ్చింది. మెడికల్ థ్రిల్లర్‌గా రూపొందబోయే ఈ చిత్రంతో ఎం.ఆర్.కృష్ణ దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. పిల్ల జమీందార్, ద్రోణ వంటి సినిమాలను నిర్మించిన డి.ఎస్.ఆర్ సురేష్ మూవీస్ ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ సపోర్ట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్తి వివరాలను త్వరలోనే తెలియజేస్తామన్నారు.




Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in